# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 076
పేజీలు : 06 | వెల: రూ.5/-
శుక్రవారం
మార్చి 06, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net



2లో..

## సివిల్స్ ఫలితాల్లో కాజీపేట కుర్రాడి సత్తా

- అట్ల తరుణ్ తేజకు 123వ ర్యాంకు
- ఉపాధ్యాయుల ఇంట 'కలెక్టర్' కల సాకారం
- ఐఐటీ ముంబై టాపర్ నుంచి ఐఏఎస్ దిశగా..


వివరాలు2లో..

# ఎనుమాముల ఎరుపెక్కె

వరంగల్ జిల్లాలోని ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి ధరలు సరికొత్త రికార్డులను సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా దేశీ మరియు సింగిల్ పట్టి రకాలకు అంతర్జాతీయ స్థాయిలో విపరీతమైన డిమాండ్ పెరగడంతో, క్వింటా ధర రూ. 40,000 మార్కును తాకింది. నాలుగేళ్ల నిరీక్షణ తర్వాత దేశీ మిర్చికి ఈ స్థాయి ధర లభించడం పట్ల రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది. ఆసియాలోనే అతిపెద్ద మార్కెట్లలో ఒకటిగా పేరొందిన ఎనుమాములలో గత రెండు రోజుల్లోనే సుమారు 40,000 బస్తాల మిర్చి తరలిరావడం ఈ సీజన్‌లోనే రికార్డుగా నమోదైంది. జియో ట్యాగింగ్ కలిగిన మిర్చికి విదేశాల్లో మంచి క్రేజ్ ఉండటం, ఎగుమతిదారులు పోటీపడి కొనుగోలు చేయడమే ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణం. గత నెలలో రూ. 16,000 ఉన్న సగటు ధర ప్రస్తుతం రూ. 18,500 దాటడం గమనార్హం.

- వరంగల్ వాయిస్, ఎనుమాముల

**ఎనుమాముల మార్కెట్ గణాంకాలు:**

| అంశం | వివరాలు |
|---|---|
| రాక (Arrivals) | గత రెండు రోజుల్లో 35,000 - 40,000 బస్తాలు |
| ప్రస్తుత సగటు ధర | రూ. 18,489 (క్వింటాకు) |
| గత నెల సగటు ధర | రూ. 16,300 - 16,800 |

- సింగిల్ పట్టి, దేశీ రకాలకు రూ.40 వేల ధర
- మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి..
- రెండు రోజుల్లో 40 వేల బస్తాల రాక
- నాలుగేళ్ల తర్వాత దేశీ మిర్చికి పెరిగిన డిమాండ్
- క్వింటా సగటు ధరలోనూ రికార్డు వృద్ధి


8లో..

## 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'

- జూన్ 12 వరకు 99 రోజుల కార్యాచరణ
- మహబూబాబాద్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సన్నాహక సమావేశం
- పాల్గొన్న మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ, కలెక్టర్లు
- ఏప్రిల్ 2న రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలు


2లో..

## కడియం మాటలు అబద్ధం

- మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య


8లో..


## హనుమకొండ జిల్లాలో ఘోర ప్రమాదం

- టిప్పర్ లారీ కిందపడి ఇద్దరు విద్యార్థులు దుర్మరణం
- హసన్‌పర్తి పెద్ద చెరువు సమీపంలో విషాదం
- మృతులు ఎస్సార్ కాలేజీ విద్యార్థులుగా గుర్తింపు

## ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన సాగాలి

- చైర్మన్ సునీల్ కుమార్, కౌన్సిలర్లకు రేవూరి శుభాకాంక్షలు

**వరంగల్ వాయిస్, పరకాల :** పట్టణ సమగ్ర అభివృద్ధి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జరగాలని, అందుకు నూతన పాలక మండలి అంకితభావంతో పనిచేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పరకాల మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన నూతన పాలక మండలి బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన పావుశెట్టి సునీల్ కుమార్, పాలక మండలి సభ్యులకు ఎమ్మెల్యే ఈ సందర్భంగా హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అనంతరం నూతన కౌన్సిలర్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ.. పరకాల పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.


4లో..

# ఎనుమాముల 'ఎరుపెక్కె'

- సింగిల్ పట్టి, దేశీ రకాలకు రూ.40 వేల ధర
- మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి..
- రెండు రోజుల్లో 40 వేల బస్తాల రాక
- నాలుగేళ్ల తర్వాత దేశీ మిర్చికి పెరిగిన డిమాండ్
- క్వింటా సగటు ధరలోనూ రికార్డు వృద్ధి

**వరంగల్ వాయిస్, ఎనుమాముల :** ఆసియాలోనే అతిపెద్ద వ్యవసాయ మార్కెట్లలో ఒకటైన వరంగల్ ఎనుమాముల యార్డు ప్రస్తుతం మిర్చి ఎరుపుతో మెరిసిపోతోంది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి కూడా రైతులు పెద్ద ఎత్తున మిర్చిని తరలించడంతో మార్కెట్ ప్రాంగణం బస్తాలతో నిండిపోయింది. గత రెండు రోజులుగా సుమారు 35 నుంచి 40 వేల బస్తాల మిర్చి అమ్మకానికి రావడం ఈ సీజన్‌లోనే అత్యధికమని అధికారులు పేర్కొంటున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈసారి మిర్చి ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా నాణ్యమైన మిర్చి రకాలకు వ్యాపారులు రికార్డు స్థాయి ధరలు చెల్లిస్తున్నారు. దాదాపు నాలుగు సంవత్సరాల నిరీక్షణ తర్వాత దేశీ మిర్చి ధరలు మళ్లీ పుంజుకోవడం విశేషం. 2021–22 సీజన్‌లో లక్ష రూపాయల వరకు పలికిన ధర, ఆ తర్వాత భారీగా పడిపోయింది. అయితే, ప్రస్తుతం జియో ట్యాగింగ్ కలిగిన దేశీ మిర్చికి అంతర్జాతీయ మార్కెట్‌లో, ముఖ్యంగా విదేశాలలో విపరీతమైన డిమాండ్ పెరిగింది. దీంతో ఎగుమతిదారులు పోటీపడి కొనుగోలు చేస్తుండటంతో ధరలు మళ్లీ రూ.40 వేల మార్కును తాకాయి.



**పెరుగుతున్న సగటు ధర**

గత నెలలో మిర్చి సీజన్ ప్రారంభమైనప్పుడు క్వింటా సగటు ధర రూ. 16,300 – 16,800 మధ్య ఉండేది. కానీ, వరుస సెలవుల తర్వాత మార్కెట్ పునఃప్రారంభం కావడంతో ధరల్లో స్పష్టమైన పెరుగుదల కనిపిస్తోంది. ప్రస్తుతం సగటు ధర రూ. 18,489కి చేరినట్లు మార్కెట్ వర్గాల విశ్లేషణ. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వలు తగ్గడం, అంతర్జాతీయ ఎగుమతులు పెరగడం వల్ల రాబోయే రోజుల్లో ధరలు మరిన్ని రికార్డులు సృష్టించే అవకాశం ఉందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

**పెరుగుతున్న డిమాండ్‌కు కారణాలు**

* అంతర్జాతీయ ఎగుమతులు: ముఖ్యంగా జియో ట్యాగింగ్ ఉన్న దేశీ మిర్చికి విదేశీ మార్కెట్లలో గిరాకీ పెరిగింది.
* తగ్గిన నిల్వలు: కోల్డ్ స్టోరేజీలలో పాత నిల్వలు తగ్గడం వల్ల కొత్త పంటకు మంచి ధర లభిస్తోంది.
* **నాణ్యత:** ఈ ఏడాది దిగుబడిలో నాణ్యత మెరుగ్గా ఉండటంతో వ్యాపారులు పోటీ పడుతున్నారు.



**వివిధ రకాల మిర్చి ధరలు(క్వింటాకు గరిష్ఠంగా):**

| మిర్చి రకం | ధర (రూపాయలలో) |
|---|---|
| సింగిల్ పట్టి & దేశీ మిర్చి | 40,000 |
| వండర్ హాట్ | 35,000 |
| దీపిక రకం | 30,000 |
| యూఎస్ 341 | 21,000 |
| ఎల్లో మిర్చి | 20,000 |
| తేజ రకం | 18,800 |
| తాలు మిర్చి | 12,000 |

# సివిల్స్ ఫలితాల్లో కాజీపేట కుర్రాడి సత్తా

- అట్ల తరుణ్ తేజకు 123వ ర్యాంకు
- ఉపాధ్యాయుల ఇంట 'కలెక్టర్' కల సాకారం
- ఐఐటీ ముంబై టాపర్ నుంచి ఐఏఎస్ దిశగా..



**వరంగల్ వాయిస్, కాజీపేట :** హనుమకొండ జిల్లా కాజీపేట ప్రశాంత్ నగర్‌కు చెందిన అట్ల తరుణ్ తేజ జాతీయ స్థాయిలో సత్తా చాటారు. శుక్రవారం విడుదలైన యూపీఎస్సీ (సివిల్ సర్వీసెస్) – 2025 ఫలితాల్లో ఆయన 123వ ర్యాంకు సాధించి జిల్లా కీర్తిని దశదిశలా చాటారు. ఒక సామాన్య ఉపాధ్యాయ కుటుంబం నుంచి వచ్చిన తరుణ్ తేజ ఈ ఘనత సాధించడంపై స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తరుణ్ తేజ విద్యాభ్యాసం మొదటి నుంచీ అత్యంత ప్రతిభావంతంగా సాగింది. కాజీపేటలోని సెయింట్ క్యాపిటల్ హైస్కూల్‌లో పదో తరగతి వరకు చదివారు. హైదరాబాద్ మాదాపూర్‌లోని చైతన్య నారాయణ కళాశాలలో పూర్తి చేశారు. జేఈఈ మెయిన్స్‌లో అఖిల భారత స్థాయిలో 8వ ర్యాంకు సాధించి సంచలనం సృష్టించారు. అనంతరం ఐఐటీ ముంబైలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో బీటెక్ పూర్తి చేశారు. ప్రస్తుతం ఐఆర్ఎంఎస్ లో ఉన్నతాధికారిగా సేవలందిస్తూనే, పట్టుదలతో సివిల్స్ రాసి ఐఏఎస్ లక్ష్యాన్ని చేరుకున్నారు. తరుణ్ తేజ తల్లిదండ్రులు ఇద్దరూ విద్యాశాఖలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నారు. తండ్రి అట్ల రవీందర్ పంథిని జిల్లా పరిషత్ పాఠశాలలో భౌతిక శాస్త్ర స్కూల్ అసిస్టెంట్‌గా, తల్లి అట్ల అమరావతి వర్ధన్నపేట మండలం రామ్ ధన్ తండా యూపీఎస్‌లో భౌతిక శాస్త్ర స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. వీరి స్వగ్రామం ఆత్మకూరు మండలంలోని కామారం. తమ కుమారుడు సివిల్స్‌లో అత్యుత్తమ ర్యాంకు సాధించడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ, క్రమశిక్షణతో కూడిన కఠోర శ్రమే తనను ఈ స్థాయికి చేర్చిందని పేర్కొన్నారు. తరుణ్ తేజను పలువురు ప్రముఖులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, మిత్రులు అభినందనలతో ముంచెత్తుతున్నారు.

# దేవాదుల ప్రాజెక్టుపై కడియం మాటలు అబద్ధం

- మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య
- అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం పాతాళానికి తొక్కేసింది
- కడియం, రేవంత్ పై తాటికొండ రాజయ్య నిప్పులు
- నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్

**వరంగల్ వాయిస్, రఘునాథ్‌పల్లి :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి కుంటుపడిందని, ప్రజలను మోసం చేస్తూ పాలన సాగిస్తున్నారని తెలంగాణ తొలి ఉపముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య విమర్శించారు. శుక్రవారం రఘునాథ్‌పల్లి మండలం మాజీ ఎంపీపీ వై.కుమార్ గౌడ్ నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై విమర్శలు చేస్తూ.. "నువ్వు ఏ పార్టీలో ఉన్నావో చెప్పమంటే సమాధానం దాటవేస్తున్నారు. కాంగ్రెస్‌లో చేరిన ఫొటోలు, వీడియోలు ఏఐ సృష్టి అని చెప్పడం ఆయన దివాళాకోరుతనానికి నిదర్శనం" అని రాజయ్య మండిపడ్డారు. తన ద్వారా లబ్ధి పొందిన వారినే తనపైకి ఉసిగొల్పుతున్నారని ఆరోపించారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో దేవాదుల ప్రాజెక్టు పనులు 90 శాతం బీఆర్ఎస్ హయాంలోనే పూర్తయ్యాయని, కేవలం ఫ్లెక్సీలతో అభివృద్ధి చేస్తున్నట్లు కడియం భ్రమ కలిగిస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పదవిని కాపాడుకోవడానికే ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారని రాజయ్య ఎద్దేవా చేశారు. రైతు భరోసా, మహాలక్ష్మి రూ. 2500, ఆసరా పెన్షన్ల పెంపు వంటి వాగ్దానాలు అమలు కాలేదని ఆరోపించారు.అభివృద్ధి చేయాల్సింది పోయి హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చివేస్తున్నారని ధ్వజమెత్తారు. రఘునాథ్‌పల్లి



మండలానికి గత రెండేళ్లలో ఎన్ని నిధులు కేటాయించారో ఎమ్మెల్యే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిధుల కేటాయింపులో బీఆర్ఎస్ సర్పంచులు ఉన్న గ్రామాలకు అన్యాయం చేస్తున్నారని, ఇలాంటి నిరంకుశత్వం సరికాదని హెచ్చరించారు. కడియం శ్రీహరికి దమ్ముంటే నేరుగా తనతో తేల్చుకోవాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ ఎర్రోళ్ల కుమార్ గౌడ్, మాజీ జడ్పీటీసీ బొల్లం అజయ్, గూడ కిరణ్, ఉప సర్పంచ్ ద్యావర యాకయ్య, బాలబోయిన శ్రీనివాస్, ముప్పిడి శ్రీనివాస్, సింగిరెడ్డి తిరుమల్ రెడ్డి, ఎదునూరి ఉప్పాలయ్య, ఎండీ అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



# దామెర పోలీస్ స్టేషన్‌లో 'క్లీన్ అండ్ గ్రీన్'

- స్వయంగా శుభ్రం చేసిన ఎస్సై, సిబ్బంది

**వరంగల్ వాయిస్, దామెర :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం దామెర పోలీస్ స్టేషన్‌లో 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. స్టేషన్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు పోలీసులు నడుం బిగించారు. దామెర ఎస్సై నేతృత్వంలో ఏఎస్సై, హెడ్ కానిస్టేబుల్, ఇతర పోలీస్ సిబ్బంది అందరూ కలిసి ఈ శ్రమదానంలో పాల్గొన్నారు. పోలీస్ స్టేషన్ లోపలి భాగంతో పాటు, స్టేషన్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, మొక్కలకు పాదులు చేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రజలకు రక్షణ కల్పించడంతో పాటు, సమాజానికి ఆదర్శంగా నిలిచేలా తమ కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటున్నట్లు తెలిపారు. ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటేనే పని చేసే సిబ్బందికి, స్టేషన్‌కు వచ్చే ప్రజలకు ఆహ్లాదకరంగా ఉంటుందని పేర్కొన్నారు. 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దామెర పోలీస్ స్టేషన్ సిబ్బంది అందరూ పాల్గొని స్టేషన్ ఆవరణను సుందరంగా తీర్చిదిద్దారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
శుక్రవారం, మార్చి 06, 2026



## శివాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే రేవూరి భూమి పూజ

**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన శివాలయ నిర్మాణ పనులకు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొని, శాస్త్రోక్తంగా పునాది రాయి వేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో శివాలయ నిర్మాణం జరగడం వల్ల భక్తులకు గొప్ప ఆధ్యాత్మిక కేంద్రం అందుబాటులోకి వస్తుందని ఆకాంక్షించారు. దేవాలయాల నిర్మాణం భక్తి భావంతో పాటు గ్రామ ప్రజల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందిస్తుందని ఆయన పేర్కొన్నారు. గ్రామస్తులందరూ కలిసికట్టుగా ఆలయ నిర్మాణానికి పూనుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే తెలిపారు. రాబోయే రోజుల్లో ఆలయ నిర్మాణం త్వరగా పూర్తై, భక్తులకు సకల సౌకర్యాలు లభించేలా గ్రామాభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## వేలేరు ప్రగతికి 'కడియం' బాసట

**వరంగల్ వాయిస్, వేలేరు :** వేలేరు మండల కేంద్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్యల సహకారంతో మంజూరైన రూ.30 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను వేలేరు సర్పంచ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బిల్లా యాదగిరి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్యల ప్రత్యేక చొరవతో వేలేరు గ్రామానికి భారీగా నిధులు వస్తున్నాయని తెలిపారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణానికి రూ.22 లక్షలు, విలేజ్ ఆర్గనైజేషన్ (VO) భవన నిర్మాణానికి రూ.10 లక్షలు, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.30 లక్షలు కేటాయించారు. త్వరలోనే ప్రధాన రహదారి వెంట డ్రైనేజీ పనులను కూడా ప్రారంభిస్తామని, వేలేరును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ శ్రీకర్, పంచాయతీ కార్యదర్శి రవికుమార్, వార్డు సభ్యులు సురేష్, సంధ్య, ప్రశాంత్, ప్రవళిక, చైతన్య, సునీల్ పాల్గొన్నారు. అలాగే కాలనీ పెద్దలు వేణుగోపాల్ రెడ్డి, వీరారెడ్డి, రాజు, రవీందర్ రెడ్డి, సాంబరాజు, నారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వంద పడకల ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకురావాలి

- లింగాల ఘనపూర్‌లో మెగా హెల్త్ క్యాంప్ ప్రారంభం
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి పాల్గొన్న కడియం



**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘనపూర్ :** ప్రజా ప్రతినిధులు, అధికారులు నిరంతరం ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. శుక్రవారం లింగాల ఘనపూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా హెల్త్ క్యాంప్‌ను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, పేద ప్రజలు సామాన్య రోగాలకు కూడా కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోకూడదని, ప్రభుత్వ ఆసుపత్రులలోనే మెరుగైన వైద్యం అందాలని ఆకాంక్షించారు. స్టేషన్ ఘనపూర్‌లో రూ.45.50 కోట్లతో నిర్మిస్తున్న 100 పడకల ఆసుపత్రిని డిసెంబర్ 2026 నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్‌ను కోరారు. ఘనపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తక్షణమే డయాలసిస్ సెంటర్ ప్రారంభించాలని, అలాగే కంచనపల్లి, చిల్పూర్, పెద్ద పెండ్యాలలో కొత్త PHCల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు, గురుకుల విద్యార్థినులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించి హెల్త్ కార్డులు అందజేయాలని అధికారులకు సూచించారు. 99 రోజుల పాటు సాగే ఈ ప్రగతి ప్రణాళికలో సర్పంచులు, ఇతర ఎన్నికైన ప్రజా ప్రతినిధులందరూ క్రియాశీలకంగా పాల్గొనాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యా, వైద్యం, సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలు నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. జనగామ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సందీప్ కుమార్ ఝాకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. విద్యా, సాగునీరు, ధాన్యం కొనుగోళ్లలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని, ప్రజా ప్రతినిధుల నుంచి పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ, ఆర్డీఓ, వైద్య శాఖ అధికారులు, సర్పంచులు, ఆశా వర్కర్లు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## వెజిటేబుల్ మార్కెట్ నిర్మాణానికి ముందడుగు

- స్థల పరిశీలన చేసిన అధికారులు
- ఎంపీడీవో కార్యాలయ సమీపంలో నిర్మాణం
- ఏఎంసీ చైర్ పర్సన్ తౌటం ఝాన్సీ రాణి



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** మండల కేంద్రంలోని కూరగాయల రైతులు, ప్రజల దశాబ్దాల కష్టాలను తీర్చేందుకు ప్రభుత్వం కీలక అడుగు వేసింది. హుజరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి ఒడితెల ప్రణవ్ బాబు ప్రత్యేక చొరవతో, కమలాపూర్‌లో నూతన వెజిటేబుల్ మార్కెట్ నిర్మాణానికి అధికారులు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా మార్కెటింగ్ అధికారి అనురాధ, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్లేష్ స్థల పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్ మాట్లాడుతూ.. 23 గ్రామాలకు కూడలిగా ఉన్న కమలాపూర్‌లో సరైన మార్కెట్ సౌకర్యం లేక రైతులు రామాలయం వద్ద రోడ్డుపైనే వ్యాపారం సాగిస్తున్నారని తెలిపారు. దీనివల్ల ట్రాఫిక్ అంతరాయం కలగడమే కాకుండా ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు, స్థానికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఎంపీడీవో కార్యాలయానికి సమీపంలో ఉన్న స్థలాన్ని మార్కెట్ యార్డు కోసం ఎంపిక చేసినట్లు వివరించారు. రెవెన్యూ అధికారులు ఈ స్థలాన్ని అధికారికంగా నిర్ధారించిన వెంటనే, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో అన్ని వసతులతో కూడిన అధునాతన కూరగాయల మార్కెట్ యార్డును నిర్మిస్తామని ఝాన్సీ రాణి హామీ ఇచ్చారు. ఈ మార్కెట్ అందుబాటులోకి వస్తే మండలంలోని వేలాది మంది రైతులకు, వినియోగదారులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి జన్ను యాకయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేష్ గౌడ్, మార్కెట్ డైరెక్టర్లు సముద్రాల కృష్ణ, జనగాని శివకృష్ణ, ఆకినపల్లి భిక్షపతి, కిన్నెర కృష్ణమూర్తి, ఆన్కార్ అశోక్, మాజీ సర్పంచులు గంధసరి రవికుమార్, శనిగరం సమ్మయ్య, మౌటం చిరంజీవి, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## వెంకటాపూర్‌లో మెగా వైద్య శిబిరం

☐ 205 మందికి ఉచిత చికిత్స

**వరంగల్ వాయిస్, వెంకటాపూర్ :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" వంద రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం వెంకటాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో భారీ మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరం ద్వారా సుమారు 205 మంది గ్రామీణ ప్రజలకు నిపుణులైన వైద్యులతో ఉచిత వైద్య సేవలు అందించినట్లు వైద్యాధికారి డాక్టర్ సీహెచ్.శ్రీకాంత్ వెల్లడించారు. ఈ శిబిరంలో వేర్వేరు ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారికి స్పెషలిస్ట్ డాక్టర్లు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. స్త్రీల సంబంధిత వ్యాధులు 67 మంది, ఎముకల సమస్యలు 16 మంది, కంటి సమస్యలు 34 మంది, దంత సమస్యలు 13 మంది, ఇతర సాధారణ వ్యాధులు 75 మందికి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగానే జవహర్ నగర్ కేజీబీవీ, మోడల్ స్కూల్ హాస్టల్ విద్యార్థులకు ప్రత్యేకంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. దాదాపు 290 మంది విద్యార్థులను పరీక్షించగా, వారిలో ఆరోగ్య సమస్యలున్న 134 మందికి తక్షణ చికిత్స అందించి అవసరమైన సూచనలు చేశారు. ఈ మెగా శిబిరంలో గైనకాలజిస్ట్ డాక్టర్ విద్యా రాణి, నేత్ర వైద్య నిపుణురాలు డాక్టర్ అనూష, ఎముకల నిపుణులు డాక్టర్ రాజ్ కమల్, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రాజకుమార్, దంత వైద్య నిపుణులు డాక్టర్ హరీష్ తమ సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ రిషిత, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మాడిశెట్టి శ్రీనివాస్, పీహెచ్ఎన్ఓ శోభ, హెల్త్ సూపర్ వైజర్ పుష్ప కుమారి, నర్సింగ్ ఆఫీసర్ మునెమ్మ, ఆరోగ్య కార్యకర్తలు అనురాధ, స్వప్న, కనకలక్ష్మి, మోతిలాల్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## మెగా మెడికల్ క్యాంపు




**వరంగల్ వాయిస్, శాయంపేట :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా శాయంపేట మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో శుక్రవారం భారీ మెడికల్ క్యాంపు నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ జి.రజని అధ్యక్షతన జరిగిన ఈ శిబిరంలో సుమారు 500 మంది విద్యార్థినులకు నిపుణులైన వైద్యులు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరానికి వివిధ విభాగాల నుండి ప్రముఖ వైద్యులు విచ్చేసి విద్యార్థినులకు వైద్య సేవలు అందించారు. పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ తిరుపతి, గైనకాలజిస్ట్ డాక్టర్ హరిక, ఫిజీషియన్ డాక్టర్ ఎండీ మునీబ్, దంత వైద్యులు డాక్టర్ భాను చందర్, వీరితో పాటు ఆర్‌బీఎస్‌కే వైద్యులు డాక్టర్ రవీందర్, డాక్టర్ సంధ్యారాణి విద్యార్థినుల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో ఒక ప్రత్యేక అంశంగా పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ఎన్. సాయి కృష్ణ విద్యార్థినులకు అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడే సీపీఆర్ విధానంపై శిక్షణ ఇచ్చారు. గుండెపోటు లేదా ఊపిరి ఆగిపోయిన సమయంలో ప్రాథమిక చికిత్స ఎలా అందించాలో ఆయన ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ బి.శ్రావణి, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్స్, హెల్త్ సూపర్వైజర్ ఒ.స్వప్న, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయినీ బృందం, ఆశా వర్కర్లు పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు. ప్రభుత్వం తమ వద్దకే వచ్చి ఇలాంటి నాణ్యమైన వైద్య పరీక్షలు నిర్వహించడం పట్ల విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

# 99 రోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలి

- ఎంపీడీవో గుమ్మడి కల్పన
- పంచాయతీ కార్యదర్శులకు దిశానిర్దేశం



**వరంగల్ వాయిస్, దామెర :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని మండలంలో విజయవంతం చేయాలని ఎంపీడీవో గుమ్మడి కల్పన పిలుపునిచ్చారు. ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు కొనసాగనున్న ఈ కార్యక్రమంపై శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆమె దిశానిర్దేశం చేశారు. ఈ 99 రోజుల కాలంలో గ్రామాలలో చేపట్టాల్సిన ప్రాధాన్యత పనుల గురించి ఎంపీడీవో వివరించారు. ముఖ్యంగా మురుగు కాల్వల అక్రమణల తొలగింపు, దోమల నివారణకు ఫాగింగ్, తడి–పొడి చెత్త సేకరణ, ప్రతి శుక్రవారం 'డ్రై డే' కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలి. పల్లె ప్రకృతి వనాలు, క్రీడా మైదానాలు, స్మశాన వాటికలు మరియు ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలి. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. గ్రామ స్థాయిలో మెడికల్ క్యాంపుల నిర్వహణ ద్వారా ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించాలి. పెండింగ్ ఫైళ్లను తక్షణమే క్లియర్ చేయాలని, అభివృద్ధి పనుల్లో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉద్యోగులతో పాటు మహిళా సంఘాల సభ్యులు, స్థానిక నాయకులను భాగస్వామ్యం చేయాలని సూచించారు. 99 రోజుల పాటు సాగే ఈ యజ్ఞంలో ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేసి మండలాన్ని ఆదర్శంగా నిలపాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీఓ రంగాచారి, మండల కార్యాలయ సిబ్బంది, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

- జడ్పీ సీఈవో శేషాద్రి



**వరంగల్ వాయిస్, దామెర :** మండల పరిధిలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను, ముఖ్యంగా పెండింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి శేషాద్రి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన దామెర మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో, కార్యాలయ సిబ్బంది ఆయనకు మొక్కను అందించి ఘనంగా స్వాగతం పలికారు. తనిఖీలో భాగంగా సీఈవో తొలుత ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా, ఉద్యోగులందరూ తప్పనిసరిగా సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. అనంతరం కార్యాలయ పరిసరాలను పరిశీలించి, పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేశారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాలలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని సీఈవో సూచించారు. అలాగే ఉపాధి హామీ పథకం పనుల పురోగతిని అడిగి తెలుసుకుని, క్షేత్రస్థాయిలో కూలీలకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ఈ గ్రాంట్ కింద మంజూరైన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గుమ్మడి కల్పన, ఎంపీఓ రంగాచారి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# వృద్ధాశ్రమానికి రోటరీ క్లబ్ భారీ విరాళం

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నిరుపేదలు, వృద్ధుల సేవలో రోటరీ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుందని రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సెంట్రల్ (డిస్ట్రిక్ట్ 3150) అధ్యక్షులు మడూరి గణేష్ అన్నారు. ములుగు రోడ్డులోని మూడవ డివిజన్ పరిధిలో ఉన్న స్వయంకృషి మహిళా సొసైటీ వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులు నేలపై పడుకుంటూ ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న రోటరీ క్లబ్ సభ్యులు, దాతల సహకారంతో సుమారు లక్ష రూపాయల వ్యయంతో 16 మంచాలను అందజేశారు. ఈ సందర్భంగా మడూరి గణేష్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా 40 వేల క్లబ్బులు, లక్షలాది మంది సభ్యులతో రోటరీ సంస్థ సొంత ఖర్చులతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. గత ఎనిమిది నెలల కాలంలోనే సుమారు 10 లక్షల రూపాయల వ్యయంతో పేదలకు కుట్టు మిషన్లు, సైకిళ్ల పంపిణీ, వాటర్ ప్లాంట్లు, ఫ్రిడ్జ్‌లు, వాటర్ కూలర్ల ఏర్పాటు, ఆసుపత్రులలో ఉచితంగా ప్రోటీన్ పౌడర్ల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. వృద్ధాశ్రమంలోని వారికి ఎలాంటి వైద్య అవసరాలు వచ్చినా దేవ హాస్పిటల్ (జేపీఎన్ రోడ్డు) వారు ఉచితంగా సేవలు అందిస్తారని ప్రకటించారు. రోటేరియన్ దేవ మహేందర్, వారి కుమారులు డాక్టర్ విశాల్ రాజ్ (జనరల్ మెడిసిన్), డాక్టర్ సాహస రాజా అందుబాటులో ఉండి వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సెక్రటరీ పొన్న హరినాథ్, కోశాధికారి బండారు కుమారస్వామి, ముఖ్య నాయకులు తోట సంపత్ కుమార్, బేతి అశోక్ బాబు, జూలూరి కృష్ణమూర్తి, వడ్నాల సదానందం, దేవ మహేందర్, పోరండ్ల రత్నాకర్, నాయిని అనిల్, కిరణ్, బేతి రాజేందర్, వేణు, స్వయంకృషి సేవా సొసైటీ ప్రతినిధులు,యు లబ్ధిదారులు పాల్గొన్నారు.



# వరికోలు ఆరెకుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మోహన్ రావు

**వరంగల్ వాయిస్, నడికూడ :** మండల పరిధిలోని వరికోలు గ్రామంలో ఆరెకుల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కానాల మోహన్ రావు, ఉపాధ్యక్షులుగా చింతలపల్లి కృష్ణారావు, మురాల భాను, ప్రధాన కార్యదర్శిగా మురాల రవీందర్, కార్యదర్శిగా శ్రీనివాస్, కోశాధికారిగా కుడుతాల బాపూరావు, సలహాదారులుగా డైగ కృష్ణారావు, అంబరగొండ శ్రీకాంత్, లడే రాజేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా కరట్లపల్లి మహేందర్, మురాల రాజు, మురాల చిరంజీవి, అదరసండి వీరన్నలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మురాల భుజంగరావు, డైగ రాజేశ్వరరావు, కరట్లపెల్లి సాంబయ్య, కానాల రాజేశ్వరరావు, రామారావు, రమేష్, అధిక సంఖ్యలో కుల బాంధవులు పాల్గొన్నారు.

# ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన సాగాలి

*(మొదటి పేజీ తరువాయి)* రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన తాగునీరు, డ్రైనేజీ, రహదారులు మరియు పారిశుధ్యం వంటి కనీస మౌలిక వసతులు అందించడంలో రాజీ పడకూడదని సూచించారు. పట్టణ ప్రగతి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలని కోరారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడటమే పాలక మండలి ప్రథమ కర్తవ్యం కావాలని పేర్కొన్నారు. పరకాల పట్టణాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, రానున్న రోజుల్లో పట్టణ రూపురేఖలు మార్చే విధంగా నిధులు సమీకరించి పనులు చేపడతామని భరోసా ఇచ్చారు. నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ నగరంలోని లక్ష్మీపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఒక రోజు పాటు ఉపాధ్యాయులుగా మారి సందడి చేశారు. పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన 'స్వయం పరిపాలన దినోత్సవం' వేడుకలు విద్యార్థులలోని ప్రతిభను, నాయకత్వ లక్షణాలను వెలికితీశాయి. ఉపాధ్యాయులు రవి, వనం శ్రీవాణి, ఈలాదేవి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా సాగింది. ఈ విశేష కార్యక్రమంలో విద్యార్థులు కేవలం ఉపాధ్యాయులుగానే కాకుండా, జిల్లా విద్యాశాఖ అధికారి, ఏఏపీసీ చైర్‌పర్సన్, ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించారు. తరగతి గదుల్లో తోటి విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ ఉపాధ్యాయ వృత్తిలోని గొప్పతనాన్ని అనుభూతి చెందారు. హాజరు నమోదు, పాఠశాల క్రమశిక్షణ, మధ్యాహ్న భోజన పథకం నాణ్యతను తనిఖీ చేయడం వంటి పరిపాలనా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థులలో చిన్నతనం నుంచే బాధ్యతాయుత ప్రవర్తన, చట్టం పట్ల గౌరవం, నైతిక విలువలను పెంపొందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ప్రతి విద్యార్థి ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, గురువులను గౌరవిస్తూ క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. స్వయం పరిపాలన ద్వారా విద్యార్థులకు పరిపాలనా వ్యవస్థపై అవగాహన పెరుగుతుందని, ఇది వారి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, ఏఏపీసీ చైర్‌పర్సన్, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని చిన్నారుల ప్రదర్శనను అభినందించారు.




# పదో తరగతి విద్యార్థులకు 'రెడ్డి సంఘం' అండ

□ ఉచితంగా జామెట్రీ బాక్సుల పంపిణీ

**వరంగల్ వాయిస్, మల్రిపల్లిగూడెం :** వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులకు మల్రిపల్లిగూడెం రెడ్డి సంఘం సభ్యులు అండగా నిలిచారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పరీక్షల సమయంలో ఉపయోగపడేలా ఉచితంగా జామెట్రీ బాక్సులను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వరరావు సమక్షంలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా రెడ్డి సంఘం సభ్యులు విద్యార్థులతో ముచ్చటించి, వారిలో మనోధైర్యాన్ని నింపారు. పదో తరగతి అనేది విద్యార్థి జీవితంలో కీలక దశ అని, భయపడకుండా ఏకాగ్రతతో పరీక్షలు రాసి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆశీర్వదించారు. పరీక్షల సమయంలో సమయ పాలన మరియు ఒత్తిడిని ఎలా అధిగమించాలనే అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షులు రిక్కల శివారెడ్డి, ఉపాధ్యక్షులు కొలను వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి కొలను రామిరెడ్డి, కోశాధికారి వంగ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే సంఘ సభ్యులు బద్దిపడుగు రాజు, వంగ రాజు, బద్దిపడుగు శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొని విద్యార్థులను ఉత్సాహపరిచారు. తమకు అండగా నిలిచిన రెడ్డి సంఘం సభ్యులకు, ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన హెడ్మాస్టర్ కి విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగస్వాములు కావాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యాచరణ
- బల్దియాలో స్వచ్ఛత కార్యక్రమం
- పాల్గొన్న ఎమ్మెల్యే, మేయర్ , కలెక్టర్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ రాష్ట్రవ్యాప్తంగా ఉధృతంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం వద్ద నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, హనుమకొండ జిల్లా కలెక్టర్, ఇంచార్జి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందితో కలిసి వారు స్వచ్ఛత పనుల్లో పాల్గొని, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం, పట్టణ, గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం ఈ ప్రణాళికను రూపొందించిందని తెలిపారు.

ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, వీధి దీపాల ఏర్పాటుకు ప్రాధాన్యత, పారిశుధ్య వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం. రాబోయే 99 రోజుల్లో పట్టణ ముఖచిత్రాన్ని మార్చేలా స్పష్టమైన మార్పులు తీసుకురావడం. మున్సిపల్ యంత్రాంగం ఎంత కష్టపడినా, ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా పరిశుభ్రతను పాటించినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. "ప్రభుత్వం అందిస్తున్న ఈ సువర్ణ అవకాశాన్ని వినియోగించుకుని, వరంగల్ నగరాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు ప్రజలు ఏకతాటిపైకి రావాలి." ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కార్పొరేటర్లు, సానిటరీ సిబ్బంది, స్థానిక నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# పరిశ్రమలపై విద్యుత్ భారాన్ని తగ్గించాలి

- బహిరంగ విచారణలో బొమ్మినేని రవీందర్ రెడ్డి డిమాండ్
- కాటన్ మిల్లర్ల సమస్యలపై టీజీఈఆర్సీకి విన్నపం
- ఆఫ్ సీజన్ నిబంధనలు సవరించాలి
- పీనల్ ఛార్జీల రద్దుపై ఎన్పీడీసీఎల్ సీఎండీ సానుకూలం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగ విచారణలో పారిశ్రామిక విద్యుత్ సమస్యలు ప్రధానంగా చర్చకు వచ్చాయి. తెలంగాణ కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు బొమ్మినేని రవీందర్ రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా కాటన్ అసోసియేషన్ అధ్యక్షులు చింతలపల్లి వీరారావు పాల్గొని, పరిశ్రమలు ఎదుర్కొంటున్న విద్యుత్ భారాలపై మండలికి సుదీర్ఘంగా వివరించారు. బహిరంగ విచారణ సందర్భంగా రవీందర్ రెడ్డి గారు పలు కీలక అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ఊరట: అగ్రో బేస్డ్ ఇండస్ట్రీస్‌కు విద్యుత్ సబ్సిడీని అందించి ప్రోత్సహించాలని, దీనివల్ల రైతులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. కాటన్ మిల్లులు ఏడాదిలో కేవలం 3–4 నెలలు మాత్రమే నడుస్తాయని, మిగిలిన 8–9 నెలలు ఖాళీగా ఉన్నా విద్యుత్ భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆఫ్ సీజన్ పీరియడ్ నిబంధనలను సవరించాలని కోరారు. కేవలం కొద్ది నెలల పని కాలానికి 12 నెలల పాటు మాగ్జిమమ్ డిమాండ్ ఛార్జీలు వసూలు చేయడం భారంగా మారిందని, వీటిని తగ్గించాలని విన్నవించారు. 2012లో ఎంఎస్పీ సేకరణ కోసం మిల్లులు నడిపిన సమయంలో విధించిన పీనల్ ఛార్జీలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రవీందర్ రెడ్డి విన్నపాలపై ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ముఖ్యంగా పీనల్ ఛార్జీల రద్దు అంశం అతి త్వరలోనే పరిష్కారమవుతుందని, అధికారిక ఉత్తర్వులు రాగానే పంపిస్తామని హామీ ఇచ్చారు. అదనపు సర్ ఛార్జీల విధింపు విషయంలో పరిశ్రమల క్షేమస్థితిని పరిగణనలోకి తీసుకుంటామని అధికారులు తెలిపారు. తమ సమస్యలపై సానుకూలంగా స్పందించిన అధికారులకు ఈ సందర్భంగా బొమ్మినేని రవీందర్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.

# మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకం

**వరంగల్ వాయిస్,మహదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని పలు మసీదుల అభివృద్ధికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు భారీగా నిధులు మంజూరు చేయడంపై ముస్లిం సోదరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మసీదుల కోసం మొత్తం రూ.1.45 కోట్ల నిధులను కేటాయించినందుకు కృతజ్ఞతగా, శుక్రవారం కాళేశ్వరంలోని జామా మసీదులో మంత్రి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కాళేశ్వరం గ్రామపంచాయతీ 4వ వార్డు సభ్యులు షేక్ రహీమా బేగం–తాజుద్దీన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. శుక్రవారం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం, ముస్లిం సోదరులంతా కలిసి మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ముఖ్యంగా కాళేశ్వరం మసీదు అభివృద్ధికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేయడంపై వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. మైనారిటీల సంక్షేమానికి, మత సామరస్యానికి మంత్రి శ్రీధర్ బాబు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తారని కొనియాడారు. ఈ నిధులతో మసీదులలో అవసరమైన మౌలిక వసతులు, మరమ్మతు పనులు పూర్తి చేస్తామని



తెలిపారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ ప్రెసిడెంట్ సయ్యద్ సమద్, కాళేశ్వరం కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ జానీ, షకీల్, నబి, రయాన్, రజాక్, షేఫీక్, వాజీద్, పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



# పశువైద్యశాల ఆవరణలో 'మద్యం' సీసాలు

**వరంగల్ వాయిస్, ఎల్కతుర్తి :** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల పరిధిలోని వల్లభపూర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ పశువైద్యశాల అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతోంది. నిత్యం మూగజీవాలకు వైద్యం అందించాల్సిన ఈ ఆసుపత్రి ఆవరణ, ప్రస్తుతం మద్యం బాటిళ్లు, బీరు సీసాలతో దర్శనమిస్తుండటం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి సమయాల్లోనే కాకుండా, మధ్యాహ్నం వేళల్లో కూడా ఇక్కడికి చేరుకుని బహిరంగంగా మద్యం సేవించడం పరిపాటిగా మారింది. సేవించిన అనంతరం ఖాళీ బాటిళ్లను ఆసుపత్రి ముందే పడేయడమే కాకుండా, కొన్ని సందర్భాల్లో బీరు సీసాలను రోడ్డుపై పగలగొడుతున్నారు. దీనివల్ల అటుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పశువైద్యశాల, వాటర్ ప్లాంట్ పక్కనే ప్రసిద్ధ శివాలయం ఉంది. ఈ ఆలయానికి వెళ్లే దారిలోనే గాజు ముక్కలు విచ్చలవిడిగా పడి ఉండటంతో భక్తులు భయం భయంగా అడుగులు వేయాల్సి వస్తోంది. గ్రామంలోని పవిత్రమైన దేవాలయ పరిసరాలను, ప్రజా ప్రదేశాలను ఇలా అపవిత్రం చేయడంపై గ్రామస్థులు మండిపడుతున్నారు. ఈ విషయంపై గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి తక్షణమే స్పందించాలని వారు కోరుతున్నారు.



# నాడు పల్లం రవి.. నేడు పల్లం పద్మ

☐ అర్బన్ హెల్త్ సెంటర్ సాధనలో కీలకపాత్ర

**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వరంగల్ బల్దియా 32వ డివిజన్ పరిధిలోని ఎస్ఆర్ఆర్ తోటలో నివసించే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నూతన అర్బన్ హెల్త్ సెంటర్ భవన నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ స్థలాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఖిలా వరంగల్ తహసిల్దార్ ఇక్బాల్ శుక్రవారం నగర కార్పొరేషన్‌కు అధికారికంగా అప్పగించారు.
ఈ సందర్భంగా 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ రవి మాట్లాడుతూ.. రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ గారి ప్రత్యేక సహకారంతో కోటి 40 లక్షల రూపాయల వ్యయంతో ఈ అత్యాధునిక భవనాన్ని నిర్మించబోతున్నట్లు తెలిపారు. బీరన్న కుంట వద్ద ఈ నూతన భవన నిర్మాణం చేపట్టనున్నామని, ఇది అందుబాటులోకి వస్తే డివిజన్ ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుతాయని పేర్కొన్నారు. గత జ్ఞాపకాలను గుర్తు చేస్తూ.. "2005లో పల్లం రవి కార్పొరేటర్‌గా ఉన్న సమయంలోనే ఈ అర్బన్ హెల్త్ సెంటర్ మంజూరై ప్రజలకు సేవలు అందిస్తోంది. నాటి నుంచి నేటి వరకు అదే భవనంలో సేవలు కొనసాగుతున్నాయి. ఇప్పుడు పెరిగిన జనాభాకు అనుగుణంగా, ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి కొత్త భవనాన్ని నిర్మిస్తున్నాము" అని ఆమె వివరించారు. డివిజన్ అభివృద్ధికి, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు భారీగా నిధులు మంజూరు చేయించిన మంత్రి కొండా సురేఖ మురళి దంపతులకు కార్పొరేటర్ పల్లం పద్మ రవి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ స్థల కేటాయింపు కార్యక్రమంలో తహసిల్దార్ కార్యాలయ సిబ్బంది, కార్పొరేషన్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# ‘ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక’

- జూన్ 12 వరకు 99 రోజుల కార్యాచరణ
- మహబూబాబాద్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సన్నాహక సమావేశం
- పాల్గొన్న మంత్రులు పొంగులేటి, కొండా సురేఖ, కలెక్టర్లు
- ఏప్రిల్ 2న రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక’ 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం నేటి నుంచి ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో, మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) భవనంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి సన్నాహక సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమ రూపకల్పనపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం మూడోసారి భారీ ఎత్తున ప్రజల్లోకి వెళ్తోంది. జూన్ 12 వరకు సాగే ఈ 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామ, వార్డు సభలు నిర్వహించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోనున్నారు. ఏప్రిల్ 2న రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఏకకాలంలో గ్రామ సభలు నిర్వహించనున్నారు. వైద్యం, ఆరోగ్యం, రైతు సంక్షేమం, నిరుద్యోగిత, మహిళా సాధికారత వంటి కీలకమైన 10 అంశాలతో కూడిన నివేదికను ప్రభుత్వం సిద్ధం చేసింది. సమీక్షా సమావేశంలో మంత్రులు మాట్లాడుతూ.. ప్రజా పాలన ద్వారా క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించడమే లక్ష్యమని తెలిపారు. అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని, సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ చేరేలా అధికారులు బాధ్యత తీసుకోవాలని సూచించారు.

ఈ ఉన్నత స్థాయి సమావేశంలో మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు మురళీ నాయక్, దొంతి మాధవ్ రెడ్డి, కె.ఎల్.నాగరాజు, రాం చంద్రు నాయక్ పాల్గొన్నారు. వీరితో పాటు ఉమ్మడి వరంగల్ పరిధిలోని ఆరు జిల్లాల కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు హాజరయ్యారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికను ఒక యజ్ఞంలా భావించి, ఉమ్మడి జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని మంత్రులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



# కోటగుళ్ల గణపేశ్వరునికి పట్టు వస్త్రాల సమర్పణ

**వరంగల్ వాయిస్, గణపురం :** కాకతీయుల అద్భుత కళాక్షేత్రం, ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం (కోటగుళ్లు) లో శుక్రవారం భక్తిభావం వెల్లివిరిసింది. మండల కేంద్రానికి చెందిన పింగిలి రమేష్ చందర్ రెడ్డి - సూర్యమ్మ, సాదన్ రెడ్డి - దీప్తి దంపతులు స్వామివారికి రూ.20 వేల విలువైన నూతన పట్టు వస్త్రాలను బహూకరించారు. పింగిలి కుటుంబ సభ్యులు ప్రతి ఏటా స్వామివారికి ఏడాది పొడవునా అవసరమయ్యే పట్టు వస్త్రాలను అందజేయడం ఒక ఆచారంగా కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం ఆలయాన్ని సందర్శించిన దంపతులు, మొదట స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంగళవాయిద్యాల మధ్య నూతన పట్టు వస్త్రాలను ఆలయానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు జూలపల్లి నాగరాజు వారు పింగిలి కుటుంబ సభ్యులకు ప్రత్యేక ఆశీర్వచనాలు పలికి, తీర్థప్రసాదాలను అందజేశారు. చారిత్రక ఆలయానికి నిరంతరం సహకారం అందిస్తూ, పట్టు వస్త్రాలను బహూకరించిన రమేష్ చందర్ రెడ్డి దంపతులకు కోటగుళ్ళు పరిరక్షణ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, పరిరక్షణ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# హనుమకొండ జిల్లాలో ఘోర ప్రమాదం

- టిప్పర్ లారీ కిందపడి ఇద్దరు విద్యార్థులు దుర్మరణం
- హసన్‌పర్తి పెద్ద చెరువు సమీపంలో విషాదం
- మృతులు ఎస్సార్ కాలేజీ విద్యార్థులుగా గుర్తింపు

**వరంగల్ వాయిస్, హసన్‌పర్తి :** హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రంలో శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. పెద్ద చెరువు సమీపంలో అతివేగంగా వచ్చిన ఒక టిప్పర్ లారీ, ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు విద్యార్థులు లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులను స్థానిక ఎస్సార్ కాలేజీకి చెందిన విద్యార్థులు సుప్రతిక, అక్రమ్ గా పోలీసులు గుర్తించారు. ప్రమాదం జరిగిన తీరు అత్యంత భయానకంగా ఉండటంతో స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాలను పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం కారణంగా రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని, ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్‌పై విచారణ జరుపుతున్నారు. కళ్లముందే ఇద్దరు యువ విద్యార్థులు మృత్యువాత పడటంతో కళాశాల విద్యార్థులు, వారి కుటుంబ సభ్యుల్లో పెను విషాదం నెలకొంది.



# 8న భారీ ఉచిత వైద్య శిబిరం

**వరంగల్ వాయిస్, శాయంపేట :** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శాయంపేట మండలం గట్లకానిపర్తి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 8న భారీ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, హనుమకొండ శ్రీనివాస హాస్పిటల్, గ్రామ పంచాయతీ పాలకవర్గం, డ్వాక్రా మహిళా గ్రూపులు, గ్రామ శ్రేయోభిలాషుల సహకారంతో గ్రామ అభివృద్ధి కమిటీ - గట్లకానిపర్తి ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ శిబిరంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు సేవలు అందించనున్నారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ (స్త్రీల వ్యాధులు), పీడియాట్రిక్స్ (చిన్న పిల్లల వైద్యం), డెర్మటాలజీ (చర్మ వ్యాధులు), మరియు ఆర్థోపెడిక్ (కీళ్లు, ఎముకల వైద్యం), బీపీ, షుగర్, థైరాయిడ్, ఈసీజీ వంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించబడతాయి. రోగ నిర్ధారణ అనంతరం అవసరమైన ప్రాథమిక మందులను ఉచితంగా అందజేస్తారు. ముఖ్యంగా మహిళలకు వ్యక్తిగత శుభ్రత, పోషకాహారం, ఆరోగ్య జాగ్రత్తలపై ప్రత్యేక కౌన్సిలింగ్ ఇవ్వబడుతుంది. కేవలం గట్లకానిపర్తి గ్రామస్థులే కాకుండా, పరిసర ప్రాంతాలైన నర్సింహులపల్లి, పోచారం, మాంధారిపేట, సూరంపేట, పులుకుర్తి గ్రామాలకు చెందిన మహిళలు, వృద్ధులు, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు. “శ్రీనివాస హాస్పిటల్ హనుమకొండ వారు సామాజిక సేవా దృక్పథంతో ఈ శిబిరానికి ముందుకు రావడం అభినందనీయం. ఉదయం 8:00 గంటల నుండే రిజిస్ట్రేషన్లు ప్రారంభమవుతాయి. ప్రజలందరూ ఈ ఉచిత వైద్య సేవలను వినియోగించుకుని ఆరోగ్యవంతులుగా ఉండాలని గ్రామ అభివృద్ధి కమిటీ గట్లకానిపర్తి కోరుతుంది.



# వృద్ధులకు అండగా లయన్స్ క్లబ్

- ‘కేర్ ఫర్ ఎల్డర్ విమెన్’ సేవా కార్యక్రమం
- ఏకశిల వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** లయన్స్ క్లబ్ 320ఎఫ్ జిల్లా గవర్నర్ లయన్ చంద్రశేఖర్ ఆర్య పిలుపు మేరకు నిర్వహిస్తున్న “ఉమెన్స్ ఎంపవర్మెంట్ వీక్” (మహిళా సాధికారత వారోత్సవాలు) లో భాగంగా హంటర్ రోడ్డులోని ఏకశిల వృద్ధాశ్రమంలో శనివారం ప్రత్యేక సేవా కార్యక్రమం నిర్వహించారు. “కేర్ ఫర్ ఎల్డర్ విమెన్” పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లను పంపిణీ చేశారు.

లయన్స్ క్లబ్ హనుమకొండ థౌజండ్ పిల్లర్స్ కార్యదర్శి లయన్ వైద్యం రాజగోపాల్ సౌజన్యంతో ఈ కార్యక్రమం జరిగింది.

క్లబ్ అధ్యక్షుడు పరికిపండ్ల వేణు నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీనియర్ లయన్ సభ్యులు తాళ్లపెల్లి సురేష్, లయన్ జూలూరు చంద్రశేఖర్, గంజి నరహరి తదితరులు పాల్గొని వృద్ధుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా 60 ఏళ్లు పైబడిన వారు పాటించవలసిన ముఖ్యమైన ఆరోగ్య సూచనలపై అవగాహన కల్పించారు. రక్తపోటు, షుగర్, గుండె ఆరోగ్యంపై తరచుగా డాక్టర్‌ను సంప్రదించాలి. వైద్యుల సలహా మేరకు మందులు వేసుకోవాలి, సొంత నిర్ణయాలు తీసుకోకూడదు, పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు అధికంగా తీసుకుంటూ.. ఉప్పు, చక్కెర, నూనెలను తగ్గించాలి. శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా తగినంత నీరు తాగాలి. రోజుకు 20-30 నిమిషాల పాటు నడక లేదా యోగా చేయాలి. పడిపోకుండా జాగ్రత్త వహించాలి. అవసరమైతే చేతికర్ర లేదా సహాయం తీసుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. తోటివారితో మాట్లాడటం, పుస్తక పఠనం వంటి అలవాట్లతో ఒత్తిడి తగ్గించుకోవాలి. రోజుకు కనీసం 7-8 గంటల ప్రశాంతమైన నిద్ర అవసరం. ఒంటరితనం దరిచేరకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులతో సమయం గడపాలి. వృద్ధుల పట్ల గౌరవం కలిగి ఉండటం, వారి ఆరోగ్యానికి భరోసా కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com